రహదారికి సోలార్ వెలుగులు

- ఐ సడక్ ఆధ్వర్యంలో శ్రీకారం..
- రాయపల్లిలో ఐ సడక్ సేవలు అభినందనీయం

రాజాపూర్: జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్డు రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలంటే విద్యుత్ కనెక్షన్‌తో పాటు వీధి దీపాలకు రూ.లక్షల్లో అవసరం ఉంటుంది. చిన్న గ్రామాలైతే గ్రామ పంచాయతీకి నిధులు ఉండవు. పెద్ద గ్రామపంచాయతీలైతేనే ఫండ్ ద్వారా వీధి దీపాలు ఏర్పాటు చేయాలనుకున్నా, అంత సులువు కాదు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని విద్యుత్‌శాఖ నుంచి అనుమతి అంతా పెద్ద ప్రాసెస్. తీరా వీధిలైట్లు ఏర్పాటు చేశాక ప్రతినెల కరెంటు బిల్లు గ్రామ పంచాయతీ చెల్లించాలి. జాతీయ రహదారికి అటు ఇటు ఉన్న గ్రామాలకు విద్యుత్ కాంతులు వెలిగించాలనే లక్ష్యంతో ఐ సడక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రాజాపూర్ మండలంలోని రాయపల్లి గ్రామానికి 30 సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తోంది. ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు పక్కల ఒక్కో లైటుకు 32వేలకుపైగా ఖర్చు చేసి రూ.13 లక్షలతో 30 ఇన్‌బిల్ట్‌సోలార్ లైట్లను అమర్చారు. దీంతో వాహనదారులకు, బాటసారులకు రెండురోజుల నుంచి సోలార్ వెలుగుల మధ్య గ్రామానికి వెళ్తున్నారు.


రాయపల్లికి వెళ్లే రహదారి పక్కన ఐ సడక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు

దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాయపల్లి, రంగారెడ్డిగూడ గ్రామాలతో పాటు బాలానగర్ మండలం పెద్దాయపల్లి, కేతిరెడ్డిపల్లి, గ్రామాల్లో సైతం సీఎస్ఆర్ ఫండ్‌తో సోలార్‌లైట్స్ ఏర్పాటు చేశారు. బాలానగర్ మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో అధ్వాన్నంగా ఉన్న డార్మెటరీని కూల్చి కొత్త భవనం నిర్మాణం చేశారు. 2023–24 సంవత్సరానికి గాను మొత్తం 1.70 కోట్ల సీఎస్ఆర్ ఫండ్‌తో రాయికల్, బూర్గుల, కేశంపేట్ గ్రామాల్లో సైతం పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు.

సీఎస్ఆర్ ఫండ్‌తో అభివృద్ధి



ఏడేళ్లుగా ప్రతి సంవత్సరం సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కావాల్సిన మౌలిక వసతుల కల్పన, అవసరమున్న గ్రామాల రోడ్ల వద్ద సోలార్‌లైట్స్, రాయికల్ గ్రామంలో ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం భవనం, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఆర్ఓ ప్లాంట్స్, డిజిటల్‌క్లాస్ ఎక్విప్‌మెంట్, బాలానగర్‌లోని గురుకుల పాఠశాలలో కిచెన్‌రూం వంటి వాటిని పూర్తి చేశాం. డార్మెటరీ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. విద్యార్థులు ఆడుకునేందుకు హాకీ గ్రౌండ్ ఏర్పాటు చేశాం. కావాల్సిన స్పోర్ట్స్' ఐటమ్స్ సమకూర్చాం. వచ్చే సంవత్సరంలో చేయాల్సిన పనులకోసం నివేదికలు తయారు చేస్తున్నాం. జాతీయ రహదారిపై వాహనదారులు, ప్రయాణికుల సేఫ్టీ ఎంత ముఖ్యమో గ్రామాల్లో ప్రజలకు అవసరమున్న అభివృద్ధి పనులపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి పనులు చేస్తున్నాం. రాయపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన సోలార్ లైట్స్‌ను రెండు మూడురోజుల్లో ప్రారంభిస్తాం.

– మహ్మద్ ఇబ్రహీం, ఐ సడక్ జనరల్‌మేనేజర్, రాయికల్ టోల్‌ప్లాజా

ఐ సడక్ సేవలు అభినందనీయం



జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో రాయపల్లి గ్రామానికి రూ.13 లక్షలు వెచ్చించి ఇన్‌బిల్ట్‌సోలార్‌లైట్స్‌ను ఏర్పాటు చేసిన ఐ సడక్ సంస్థ సేవలు అభినందనీయం. కానీ మా గ్రామం వరకు అదనంగా మరో 35 లైట్లు రోడ్డు వరకు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం 30 లైట్లు ఏర్పాటు చేయడంతో అవి సగంవరకే వచ్చాయి. గ్రామం వరకు ఏర్పాటు చేస్తే గ్రామస్తులంతా ఐసడక్ సంస్థకు ఎప్పటికి రుణపడి ఉంటారు.

– కిష్టారం మల్లేష్‌గౌడ్, రాయపల్లి

సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలి



ముదిరెడ్డిపల్లి నుంచి క్రాంతినగర్, నందిగామ వరకు రెండున్నర కిలోమీటర్లు ఉన్న రహదారి వెంట రాయపల్లి గ్రామానికి ఏర్పాటు చేసినట్లు మా గ్రామాలకు ఐసడక్ వారు ఏర్పాటు చేయాలి. రాత్రివేళల్లో రహదారిపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. మా చిన్నగ్రామాలకు సోలార్‌లైట్స్ ఏర్పాటు చేస్తే మా రెండు గ్రామాలతో పాటు జడ్చర్ల మండలం కోడ్గల్ తదితర గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– రవి కుమార్, క్రాంతినగర్

'మహబూబ్‌నగర్ విద్యానిధి' ఏర్పాటు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నియోజకవర్గ విద్యార్థుల కోసం 'మహబూబ్‌నగర్ విద్యానిధి' ఏర్పాటు చేసినట్లు పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక నుంచి ఈ నిధికి ప్రతినెలా తన వేతనం నుంచి రూ. లక్ష చొప్పున వచ్చే నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలు ఇస్తానన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో సీపీఓ దీని నిర్వహణ బాధ్యతలు చూస్తారన్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ బ్రాంచిలో ఖాతా (నం.43676342719, IFSC: SBIN0021102) తెరిపించామన్నారు. ఎవరైనా దాతలు ఈ నిధికి డొనేట్ చేయవచ్చని, పేద విద్యార్థులకు సమస్యల తక్షణ పరిష్కారానికి ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాలమూరు విద్యాయజ్ఞంలో మేధావులు, వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, పూర్వ విద్యార్థులు, ఉన్నతోద్యోగులు, విశ్రాంత అధికారులు తదితరులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఇందులో ఏటా కనీసం రూ.రెండు కోట్లు జమ అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఏయే కార్యక్రమాలు చేపట్టాలి? దేనికి ఎన్ని డబ్బులు వెచ్చిస్తామో? అనే సమగ్ర వివరాలను ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

ఉచితంగా ట్యూషన్ చెప్పిస్తాం

ఇక తొమ్మిది, పదోతరగతి విద్యార్థులు ఎక్కువ ఉత్తీర్ణత శాతం సాధించేందుకు గాను జిల్లా కేంద్రంలో రెండు వార్డులకొక లర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు ఎంపిక చేసిన ఉన్నత విద్యావంతులతో ట్యూషన్ చెప్పిస్తామన్నారు. పిల్లలను సరైన మార్గంలో పెట్టడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. ఇప్పటికే వారికి డిజిటల్ కంటెంట్‌ను అందజేస్తున్నామన్నారు. మరోవైపు నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వివిధ ఉద్యోగ పరీక్షలకు ఉచిత శిక్షణ సైతం ఇప్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, వైద్యాలయాలతో పాటు అన్ని కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఆదివారం శ్రమదానం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, శిక్షణ శిబిరాలను తనిఖీ చేసి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వాస్తవానికి గత 10–15 ఏళ్లలో విద్యా ప్రమాణాలు పడిపోయాయని, ఈ రంగంలో వెనుకబడిన మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి దిశగా పయనించేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్‌ను మొదటి స్థానంలో ఉంచడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు పెద్ద విజయ్‌కుమార్, సాయిబాబ, వి.మహేందర్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పాలమూరు: భవిష్యత్‌లో అందరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని ఏనుగొండలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సన్నిధి ఆశ్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులకు ఆశీస్సులు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మీ మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మీరంతా చదువులో బాగా రాణించాలని, కష్టపడి మంచిగా చదువుకోవాలన్నారు.

క్లుప్తంగా

టీఎన్జీఓ బాలానగర్ కమిటీ ఎన్నిక

రాజాపూర్: టీఎన్‌జీఓ బాలానగర్ యూనిట్ నూతన కమిటీని గురువారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టీఎన్‌జీఓ బాలానగర్ యూనిట్ అధ్యక్షుడిగా సత్యయ్య, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా యాదయ్య, సభ్యులుగా భాస్కర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి రవికుమార్, ట్రెజరర్ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

నేడు కిష్టారంలో వైద్య శిబిరం

జడ్చర్ల టౌన్: మండలంలోని కిష్టారం గ్రామంలో శుక్రవారం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, కంటి డాక్టర్లు, స్త్రీ వ్యాధి నిపుణులు, జనరల్ మెడిసన్ నిపుణులు రోగ నిర్ధారణ చేసి మందులు అందించనున్నారని నిర్వాహకులు శివ, శేఖర్‌లు తెలిపారు.. కార్డియాలజిస్ట్ డా.భరత్‌నంద న్‌రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం కొనసాగనుందని, ఆరోగ్యశ్రీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికి అవసరమైన కంటి శస్త్రచికిత్స ఉచితంగా చేయనున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి శస్త్రచికిత్సలో 50శాతం రాయితీ ఇవ్వనున్నారు.

జాతీయస్థాయి పోటీలకు పెద్దఆదిరాల విద్యార్థి



జడ్చర్ల టౌన్: మహారాష్ట్రలో ఈనెల 7నుంచి జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు మండలంలోని పెద్ద ఆదిరాల హైస్కూల్‌కు చెందిన పవన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య గురువారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ –17 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం మహారాష్ట్రకు బయలుదేరి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అభినందించామన్నారు. అభినందించిన వారిలో పీడీ మోయిన్, ఉపాధ్యాయులు మధు, చంద్రశేఖర్, నార్యనాయక్, శ్యాంసుందర్, వెంకటయ్యలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బోర్డు ఏర్పాటు



జడ్చర్ల టౌన్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు గురువారం మాజీ సర్పంచ్ స్వర్గీయ ఈశ్వరమ్మ స్మారకార్థం ఆమె భర్త కృష్ణయ్య బోర్డును ఏర్పాటు చేయించారు. గ్రామ సర్పంచ్‌గా పదేళ్లపాటు సేవలు అందించటంతో పాటు పాఠశాల అభివృద్ధికి పాటుపడినందున ఆమె పేరు బోర్డు ఏర్పాటు చేయించి గురువారం ప్రారంభించారు. ఈశ్వరమ్మ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలకు బోర్డు ఏర్పాటు చేయించినందుకు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఏక్‌నాథ్‌రెడ్డి, నర్సింహ, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు

నవాబుపేట: మండలంలోని గురుకుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రతాప్, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, తాహేర్, అబ్దుల్లా, యాదయ్య, అంజయ్య,రవి, శ్రీనివాస్, పరుషోత్తం తదితరులు ఉన్నారు.

ఎండీ ఇసాక్ సేవలు చిరస్మరణీయం

కోయిల్‌కొండ: మండల పంచాయతీరాజ్ ఏఈ యండీ ఇసాక్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీపీ శశికళ, మాజీజెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పంచాయతీరాజ్ ఏఈ ఇసాక్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. బచ్చిరెడ్డి, కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి, నాగయ్య, యాదయ్య, రాములు, రవీందర్‌రెడ్డి, రాము, మొగులయ్య, నారాయణ, భీంరెడ్డి ఉన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన మాజీ మంత్రులు


విద్యార్థి కేతన్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ 14 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొని డబుల్ సెంచరీ 236 పరుగులు సాధించిన జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన జి. కేతన్‌ను గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు అభినందించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేతన్ తండ్రి చర్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌లు మాజీ మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కేతన్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. క్రీడా ప్రయాణంలో ఎల్లవేళలా సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. అభినందించిన వారిలో నాయకులు ప్రణీల్‌చందర్, రాజునాయక్, అంజనేయులు ఉన్నారు.

నేడు మంత్రి జూపల్లి రాక

దేవరకద్ర: దేవరకద్ర మండల కేంద్రంలో శుక్రవారం మార్కెట్ కమిటీ ప్రమాణా స్వీకారోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిలు హాజరు అవుతున్నారని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ ఓఎస్‌డీ డాక్టర్ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీనివాస గార్డెన్‌లో మార్కెట్ కమిటీ ప్రమాణా స్వీకారం, 4 గంటలకు ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం కమిటీ ప్రమాణా స్వీకారోత్సవంలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

సావిత్రిబాయి పూలే జయంతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో భారతదేశ తొలి మహిళా టీచర్ సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం నాయకులు శివన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, సామాజిక సేవా సంస్థలు, తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలని కోరారు.

ఒత్తిడి జయిస్తే విజయం మనదే


మహమ్మదాబాద్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మహమ్మదాబాద్: విద్యార్థులు పరీక్షల కోసం అనుక్షణం ఆలోచిస్తూ తీవ్రమైన మానసిక ఆందోళన చెందుతుంటారు. అలాంటి సమయంలో యోగా, ధ్యానం లాంటి ఆసనాల ద్వారా ఒత్తిడిని జయించవచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రతినిధులు రాఘవేందర్, సురేష్ తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియేట్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకునే నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో బాటు సంతోషకరమైన జీవితానికి బాటలు వేసుకోవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, అధ్యాపకులు బాబురావు, ఖాజా నిజాముద్దీన్ పాల్గొన్నారు.

బాబా మందిరంలో ధాన్యాభిషేకం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని సకల దేవతా నిలయం శ్రీ ద్వారకామయి బాబా మందిరంలో గురువారం ధాన్యాభిషేకం నిర్వహించారు. సంక్రాంతి ముందు ప్రతి ఏడాది మందిరంలో సన్నబియ్యంతో ధాన్యాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై స్పందించడం లేదు


ఎంపీ డీకే అరుణకు సమస్యను వివరిస్తున్న పెద్దార్పల్లి రైతులు

హన్వాడ: విద్యుత్ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు ఎంపీ డీకే అరుణతో ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీ మండల పరిధిలోని పెద్దార్పల్లికి చెందిన రైతులు ఎంపీని కలిశారు. వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని కోరినా, స్పందించడం లేదన్నారు. మండలంలోని విద్యుత్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఎంపీకి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ వెంటనే విద్యుత్‌శాఖ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు ఎంపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకుడు రఘురాములుగౌడ్, రైతులు రఘునందన్‌యాదవ్, కేశవులు యాదవ్, కుర్మిరెడ్డి, బస్సప్ప పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



పాలమూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్‌స్థాయిలో నాయకత్వాన్ని పెంచుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, రాజేష్, పాండురంగారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

వధశాల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని వధశాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా మాంసం విక్రయ వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు విజయబాబు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వధశాలలో చేపట్టాల్సిన పనులను పెండింగ్‌లో ఉండడం వల్ల వృత్తిదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.6.20 కోట్లతో వధశాల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి కాకుండానే ప్రారంభించారని ఆరోపించారు. వధశాల అందుబాటులోకి వస్తే రెండు వేల కుటుంబాలకు జీవనోపాధి పొందుతారన్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ రవీందర్, నరేష్, లక్ష్మీనారాయణ, ధర్మ, కమలాకర్, నరేందర్, దండోత్కర్, రాకేష్, కిషన్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలో బహుజన మహనీయులు ఆధ్యాత్మికంగా, సామాజికంగా, రాజకీయ సమానత్వం కోరుకున్న మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, సంత గురురవి దాస్, సామ్రాట్ అశోక చక్రవర్తి, సంత గాడిగే బాబా, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని శోభాయాత్ర కమిటీ నాయకులు కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి కార్యక్రమానికి రావాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేష్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి,దినేష్, నరసింహ, రవికిరణ్, గిరి పాల్గొన్నారు.

పాలనలో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ విజయేందిర బోయి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్లు, టీజీఓలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పాలనలో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పని చేయడంతో పాటు తమ శాఖకు చెందిన ఉద్యోగులతో చేయించాలని సూచించారు. అందరు కలిసి కట్టుగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణగౌడ్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు యాదగిరి, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంధ్య, బాలుయాదవ్, కోశాధికారి టైటస్‌పాల్, జగన్‌మోహన్‌రెడ్డి, రాజు, స్వాతి, జగదీష్, వీరారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, ఇమ్రాన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మధన్‌మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి, బుచ్చారెడ్డి, గట్టు వెంకట్‌రెడ్డి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్..

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్, కిష్టయ్య, ఉమాదేవి, భాస్కర్, హేమంత్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్..

డెమొక్రటిక్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను కలెక్టర్ విజయేదిర బోయి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, వామన్‌కుమార్, సంధ్యారాణి ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ కాలెండర్..

ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్..

మిడ్జిల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ సుధాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం సరస్వతి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు, మండల అధ్యక్షులు వెంకటయ్య, రమేష్‌గౌడ్, లక్ష్మయ్య, విజయభాస్కర్, అనంతరెడ్డి, జానకమ్మ, ప్రభావతి, ప్రియాంక, రాజలక్ష్మి, పరిమళ, కృష్ణమ్మ, మంజుల పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు సాయిరెడ్డి, అహ్మద్‌ఖాన్, విజయ్‌బాబు, శ్రీనివాసులు ఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌కు పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా జిల్లాలో సింగిల్ క్రూ డ్యూటీలను సవరించాలని, అభ్యర్థన మేరకు బదిలీలు చేపట్టాలని, వెంటనే ఆర్టీసీ క్లినిక్‌లో మందులు సరఫరా చేయాలని ఆర్ఎంకు విన్నవించారు. ఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పందుల పెంపకం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పందుల పెంపకం పథకాన్ని ఎరుకల కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు కోరారు. గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జేడీ డాక్టర్ మధుసూదన్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

నర్సరీల పనులు త్వరగా పూర్తి చేయాలి

నవాబుపేట: నర్సరీల పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. గురువారం మండలంలోని కామారం, తిమ్మయ్యపల్లి, పోమాల్, గురుకుంట గ్రామాల్లో నర్సరీలను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ జ్యోతి, క్రాంతికుమార్ ఉన్నారు.